ఓటరు జాబితాను తప్పులు లేకుండా సిద్ధం చేయాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి

కామారెడ్డి, డిసెంబర్ 6: తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్‌రెడ్డి అన్నారు. కామారెడ్డి కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌తో కలిసి ఎన్నికల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చేపడుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో మార్పులు, చేర్పులు, సవరణలు, ఫొటో మార్పు వంటివి సరిచేసుకోవచ్చని సూచించారు. ఓటరు జాబితాను పారదర్శకంగా తయారు చేయడానికి ఇది ఒక సువర్ణ అవకాశం అని తెలిపారు. బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరుగుతూ ఓటరు జాబితాను పరిశీలించాలన్నారు. ఒకే కుటుంబంలోని వ్యక్తుల ఓట్లు అన్ని ఒకే పోలింగ్ స్టేషన్‌లో ఉండేలా చూడాలన్నారు. గ్రాడ్యుయేట్స్, టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో అర్హులందరి పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని సూచించారు. పాల్వంచ మండలం వాడి గ్రామ పోలింగ్‌స్టేషన్ 46బూత్ లెవెల్ అధికారిణి నిమ్మల లీల సేవలు సంతృప్తిగా ఉన్నందున భారత ఎన్నికల కమిషన్ అభినందించి, ఆమె కథకాన్ని బీఎల్వో పత్రికలో ప్రచురించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఆమెకు శాలువా కప్పి సత్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవోలు రంగనాథ్ రావు, మన్నె ప్రభాకర్, తహసీల్దార్లు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ అందజేత

మాచారెడ్డి, డిసెంబర్ 6: పాల్వంచ మండలంలోని ఇసాయిపేటకు చెందిన గుంటి రాజు ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఎస్సై అనిల్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను ట్రేస్ చేశారు. మొబైల్‌ను బాధితుడికి శుక్రవారం అందజేశారు.

11న గణిత ప్రతిభా పరీక్ష

కామారెడ్డి, డిసెంబర్ 6 : రామానుజన్ జయంతి సందర్భంగా ఎస్సెస్సీ విద్యార్థులకు ఈనెల 11వ తేదీన గణిత ప్రతిభా పరీక్షను నిర్వహించనున్నట్లు తెలంగాణ గణిత ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు తాడ్వాయి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తిస్తామని తెలిపారు. గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, కార్యదర్శి రామారావు, ఆర్థిక కార్యదర్శి నరేందర్, స్వప్న, శ్రీదేవి, వెంకటి, దేవరాజు, రవి, కుమారస్వామి పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణ

రామారెడ్డి, డిసెంబర్ 6: మండల కేంద్రంలోని రైతుల పొలాల నుంచి వ్యవసాయాధికారులు శుక్రవారం మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారిణి భానుశ్రీ మాట్లాడుతూ.. భూసార పరీక్షలు చేయించుకొని, అవసరం మేరకు మందులు వాడి రైతులు అధిక దిగుబడులు సాధించాలనిసూచించారు. ఏఈవో బాల్‌దేవ్ రాకేశ్ రైతులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

లింగంపేట, డిసెంబర్ 6: లింగంపేట మండలంలోని ఆయా గ్రామాల్లో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, యూత్ మండల అధ్యక్షుడు రాజు, నాయకులు ఎల్లమయ్య, అట్టెం శ్రీనివాస్, కౌడ రవి, సాయికుమార్, అశోక్, నగేశ్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థిని చితకబాదిన పీఈటీ

రామారెడ్డి, డిసెంబర్ 6: మండలంలోని ఉప్పల్‌వాయి గురుకుల పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి కార్తికేయను పీఈటీ మహేశ్ చితకబాదాడు. శుక్రవారం వార్మప్ చేస్తున్న సమయంలో విద్యార్థిని కర్రతో వీపుపై కొట్టాడు. అతడికి రక్తం రావడంతో తల్లిదండ్రులు వచ్చి ఓ ప్రైవేటు దవాఖానలో చూపించారు. ఈ విషయమై విద్యార్థి తల్లిదండ్రులు ప్రిన్సిపాల్ శివరామ్‌ను ప్రశ్నిస్తే.. నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. తమ బాబును చితకబాదిన పీఈటీపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ

కవిత సంపుటిని ఆవిష్కరిస్తున్న యండమూరి

బిచ్కుంద, డిసెంబర్ 6: బిచ్కుందకు చెందిన ఉపాధ్యాయుడు క్రాంతికుమార్ రచించిన 'గెలుపు సంతకం' కవితా సంపుటిని ప్రముఖ నవల రచయిత యండమూరి వీరేంద్రనాథ్ హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. క్రాంతికుమార్ మండలంలోని ఫత్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా యండమూరి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి కవితలు రాయడం అభినందనీయమన్నారు.

నర్సింగ్ కోర్సు చేస్తే మంచి భవిష్యత్తు

తరగతి గదిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ రూరల్/ నస్రుల్లాబాద్, డిసెంబర్ 6: నర్సింగ్ కోర్సు పూర్తిచేసిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి దేశాయిపేట్‌లోని నర్సింగ్ కాలేజీలో మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతి గదిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బీర్కూ ర్ ఏఎంసీ చైర్‌పర్సన్ శ్యామల, నాయకులు కృష్ణారెడ్డి, ఎజాస్, నారాయణరెడ్డి, పిట్ల శ్రీధర్, శ్రావణ్‌కుమార్, రాజేశ్వర్‌గౌడ్, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన నస్రుల్లాబాద్ మండలంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, ప్రిన్సిపాల్ మాధవరావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రతిజ్ఞ చేస్తున్న మహిళా సంఘం సభ్యులు

రాజంపేట్, డిసెంబర్ 6: బాల్య వివాహాలు అరికట్టాలని డీపీఎం రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సంఘం సభ్యులతో జెండర్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీఎం సాయిలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సుతారి లక్ష్మి, సీసీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'రైతు భరోసా' విడుదల చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

లింగంపేట, డిసెంబర్ 6: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఎకరాకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలన్నారు. ఈ మేరకు తహసీల్ కార్యాలయ సిబ్బందికి భారతీయ కిసాన్ సంఘ్ అధ్యక్షుడు నర్సారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

బాల రక్షా బంధన్ కార్యాలయం ప్రారంభం

బాల రక్షా బంధన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి వరప్రసాద్

కామారెడ్డి, డిసెంబర్ 6: కామారెడ్డిలో ఏర్పాటుచేసిన బాల రక్షా బంధన్ కార్యాలయాన్ని జిల్లా జడ్జి వరప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఏర్పాటు అనంతరం మొదటిసారిగా జువెనైల్ జస్టిస్ బోర్డును ప్రారంభించుకోవడం సంతోషకరమైన విషయమన్నారు. చట్టంతో విభేదించబడిన పిల్లలకు ఈ కోర్టు ద్వారా న్యాయం చేకూరాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ జడ్జి లాల్ సింగ్ శ్రీనివాస్ నాయక్, డీఎస్ఎస్ఏ సెక్రటరీ నాగరాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి దీక్ష, పబ్లిక్ ప్రాసిక్యూటర్ అశోక్, శివరామ్, డీసీపీవో స్రవంతి, స్వర్ణలత, సీడబ్ల్యూసీ మెంబర్ రమణ, బాల రక్షా భవన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

బిచ్కుంద, డిసెంబర్ 6: మండలంలోని తక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన మేకల నారాయణ, మేకల మొగులయ్య కుమారులు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. బాధిత కుటుంబాలను జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే శుక్రవారం పరామర్శించారు. బాధితులకు ధైర్యం చెప్పారు. ఆయనవెంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నాల్చర్ రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకట రావు దేశాయి, పెద్ద తక్కడ్‌పల్లి మాజీ సర్పంచ్ పుండ్లిక్, నాయకులు బస్వరాజ్ పటేల్, యాదవరావు, మల్లికార్జున్, అనిల్ తదితరులు ఉన్నారు.

లైబ్రరీని సందర్శించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

లైబ్రరీని పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

రామారెడ్డి, డిసెంబర్ 6: రామారెడ్డిలోని లైబ్రరీని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి శుక్రవారం సందర్శించారు. పాఠకులతో మాట్లాడారు. లైబ్రరీకి రెండు రోజుల్లో పెయింటింగ్ వేయిస్తామని తెలిపారు. పాఠకులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వంశీకృష్ణ, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

శిఖం భూమిలో వేసిన బోరు సీజ్

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 6: మండలంలోని ఆత్మకూర్ శివారులో ప్రభుత్వ చెరువు కట్ట శిఖం భూమిలో అక్రమంగా వేసుకున్న బోరుమోటరును సీజ్ చేసినట్లు ఆర్ఐ మహ్మద్ తెలిపారు. ఆత్మకూర్ గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఫిర్యాదు మేరకు శుక్రవారం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. బోరు మోటరు ప్రభుత్వ శిఖం భూమిలో ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. దీంతో ట్రాన్స్‌కో లైన్‌మన్ కరుణాకర్‌తో బోరుమోటరుకు విద్యుత్తు కనెక్షన్ తొలగించి.. బోరు మోటారును సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

ధరణి ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణి ఆపరేటర్లు

కామారెడ్డి/ లింగంపేట, డిసెంబర్ 6: ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ధరణి ఆపరేటర్లు కోరుతున్నారు. ఈ మేరకు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, జిల్లా అదనపు కలెక్టర్ విక్టర్‌ను శుక్రవారం వేర్వేరుగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేతనాలను క్రమం తప్పకుండా అందించాలని, దీనిపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి అసెంబ్లీలో మాట్లాడాలని కోరారు. తొమ్మిది నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమంలో ధరణి ఫీల్డ్ టెక్నికల్ స్టాఫ్ జిల్లా కో- ఆర్డినేటర్ బాపూరావు, జిల్లా అధ్యక్షుడు లింగం, మహేశ్, శ్రీధర్ రెడ్డి, అజయ్, భరత్, మధు, ఫిరోజ్, హన్మంత్, క్రాంతి, గణేశ్, రాజేందర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం సభ్యుడు

గాంధారి, డిసెంబర్ 6: సైబర్ నేరాలతో ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పోలీసు కళాజాత బృందం సభ్యులు సూచించారు. ఎల్లారెడ్డిలోని కేటీఎస్ విద్యార్థులకు సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. బృందం ఇన్‌చార్జి ప్రభాకర్ మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తులకు మన వ్యక్తిగత వివరాలు తెలియజేయవద్దని సూచించారు. ఆడపిల్లలను ఎవరైనా వేధిస్తే 8712686094 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు సాయిలు, శేషారావు, ఉపాధ్యాయులు పరశురాం, హరి, విజయ్, సూరత్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయసేవాధికార సంస్థలో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల

కామారెడ్డి, డిసెంబర్ 6 : జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో ఖాళీగా ఉన్న స్టెనో, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్ పోస్టు కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈనెల 21వ తేదీ శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించనున్న పరీక్షకు హాజరు కావాలని పేర్కొన్నారు. స్టెనో కోసం ఉదయం 10:30 నుంచి 11:15 గంటల వరకు, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ కోసం మధ్యాహ్నం 12 నుంచి 12:40 గంటల వరకు, రికార్డ్ అసిస్టెంట్ కోసం మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఈనెల 9వ తేదీ నుంచి తమ హాల్ టికెట్లను జిల్లా కోర్టు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

భూమిని ఆక్రమించిన వ్యక్తిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 6: భూమిని ఆక్రమించి, లెవల్ చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ శుక్రవారం తెలిపారు. మండలంలోని మీసానిపల్లి గ్రామానికి చెందిన ఏగుల నర్సింహులు, ఎల్లారెడ్డికి చెందిన మర్రిప్రకాశ్‌తో కలిసి మూడేండ్ల క్రితం అవధూత సుందర్ వద్ద ఎకరం రెండు గుంటల భూమిని కొనుగోలు చేశారు. అక్కడ కోళ్లఫారాన్ని నడుపుతున్నారు. డిసెంబర్ 5వ తేదీన హాజీపూర్ గ్రామానికి చెందిన సబావత్ సురేందర్ ఆ భూమిని లెవల్ చేస్తూ చుట్టూ ఉన్న కంచెను ధ్వంసం చేశాడు. విషయం తెలిసి అడగడానికి వెళ్లిన ఏగుల నర్సింహులును సురేందర్ దూషించాడు. ఈ విషయమై ఏగుల నర్సింహులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.

కరెంట్‌షాక్‌తో మహిళ మృతి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 6: విద్యుత్ షాక్ తగిలి మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని సాతెల్లి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకున్నది. ఎస్సై మహేశ్ తెలిపిన ప్రకారం.. సాతెల్లి గ్రామానికి చెందిన ఎరుకల లక్ష్మి స్నానం చేయడానికి బాత్‌రూమ్‌లోకి వెళ్లింది. దానికి ఉన్న రేకులకు ఆకస్మాత్తుగా విద్యుత్ సరఫరా అయ్యింది. దీంతో ఆమె షాక్‌కు గురై పడిపోయింది. కుటుంబీకులు ఎల్లారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతురాలి భర్త రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 6: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శుక్రవారం జరిగింది. ఎస్సై మహేశ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మెదక్‌జిల్లా హవేళీ ఘన్‌పూర్ మండలం పోచంరాల్‌తండాకు చెందిన మెగావత్ విఠల్ (46), రమావత్ దేవీసింగ్ కలిసి సెంట్రింగ్ పనుల నిమిత్తం బైక్‌పై ఎల్లారెడ్డికి వస్తున్నారు. దేవీసింగ్ అతివేగంగా, అజాగ్రత్తగా బైక్‌ను నడపడంతో ఎల్లారెడ్డిలోని లక్ష్మీటాకీస్ వద్ద విఠల్ కిందపడడంతో తీవ్ర గాయలయ్యాయి. ఎల్లారెడ్డి దవాఖానకు తరలించగా.. మృతిచెందాడు. మృతు డి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చెరుకు లారీ బోల్తా

నిజాంసాగర్, డిసెంబర్ 6: మండలంలోని నర్సింగ్‌రావుపల్లి గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై శుక్రవారం చెరుకు లారీ బోల్తా పడింది. హైదరాబాద్ వైపు నుంచి మాగి వైపు వెళ్తుండగా.. నర్సింగ్‌రావు పల్లి చౌరస్తా వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలోని చెరుకు నేల పాలైంది. డ్రైవర్ క్షేమంగా బయటపడ్డాడు.

పోచారం ప్రాజెక్టు పరిశీలన

ప్రాజెక్టును పరిశీలిస్తున్న ఇరిగేషన్ డీఈఈ

నాగిరెడ్డిపేట, డిసెంబర్6: పోచారం ప్రాజెక్టును నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు శుక్రవారం పరిశీలించారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శనివారం ప్రాజెక్టును సందర్శించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రాజెక్టు వద్ద పార్కింగ్ స్థలం, ఆనకట్ట, గెస్ట్‌హౌస్‌ను పరిశీలించి రూట్‌మ్యాప్ తయారు చేస్తున్నట్లు చెప్పారు. ఆయనవెంట ఎమ్మెల్యే పీఏ పృథ్వీ ఉన్నారు.

94 శాతం సర్వే ఆన్‌లైన్ పూర్తి

నాగిరెడ్డిపేట, డిసెంబర్6: మండలంలో చేపడుతున్న సమగ్ర సర్వే ఆన్‌లైన్ 94 శాతం పూర్తి అయినట్లు డీఎల్పీవో సురేందర్ శుక్రవారం తెలిపారు. శనివారం వరకు వంద శాతం పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సౌకర్యాలు ఉండేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నారాయణ

రామారెడ్డి, డిసెంబర్ 6: సదాశివనగర్ జూనియర్ కాలేజీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా రామారెడ్డి జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణకు అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. అధ్యాపకులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, ఉత్తీర్ణత శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు వెంటనే చెల్లించాలి

కామారెడ్డి, డిసెంబర్ 6 : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలను అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు చెల్లించకపోతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు భరత్, కౌన్సిలర్లు నరేందర్, శ్రీనివాస్, నాయకులు వేణు, సంధ్య, యాదమ్మ పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
రాజంపేట్ బ్రాంచ్
గ్రామం & మండలం : రాజంపేట్, కామారెడ్డి జిల్లా
బంగారు ఆభరణాల వేలము
ఇందుమూలంగా రాజంపేట్ మండల పరిసర ప్రాంతాలకు తెలియజేయునది ఏమనగా తేది:10.12.2024 నాడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రాజంపేట్ బ్రాంచ్‌లో సుమారుగా 1,30,000/- రూపాయల విలువ గల ఆభరణాలు మరియు సంబంధిత చార్జీలతో బహిరంగ వేలము వేయుట జరుగుచున్నది. కావున ఆసక్తి ఉన్న కొనుగోలుదారులు ఎస్.బి.ఐ. రాజంపేట బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరని బహిరంగ ప్రకటన వేయడం జరిగినది. ఆసక్తిగలవారు మంగళవారం ఉదయం రాజంపేట్ ఎస్.బి.ఐ.బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు. వేలం వేయు స్థలం : ఎస్.బి.ఐ బ్యాంక్ రాజంపేట్, (గ్రామం & మండలం), జిల్లా కామారెడ్డి, సెల్: 9704954878 సం/- మేనేజర్

కామారెడ్డిలో 2కే రన్

కామారెడ్డి, డిసెంబర్ 6 : గంజాయి, మత్తు పదార్థాలపై అవగాహన కోసం కామారెడ్డిలో విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ), బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో శుక్రవారం 2కే రన్ నిర్వహించారు. వీహెచ్‌పీ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ నిజాంసాగర్ చౌరస్తా, స్టేషన్ రోడ్, సిరిసిల్లా రోడ్ మీదుగా రామాలయం వరకు కొనసాగింది. విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు నిత్యానందం మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూచించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి బొల్లి రాజు, ఉపాధ్యక్షుడు సామల గంగారెడ్డి, జిల్లా ప్రచార ప్రముఖ్ శ్రీకాంత్ రావు, బజరంగ్‌దళ్ జిల్లా సంయోజక వివేకానంద అశోక్, వీహెచ్‌పీ పట్టణ అధ్యక్షుడు వడ్ల వెంకటస్వామి, విశ్వం గుప్తా, జిల్లా సేవ ప్రముఖ్ కొమిరెడ్డి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

2కే రన్‌లో పాల్గొన్న యువకులు

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్
WANTED
★ స్కూల్ పిల్లల బట్టలు వాషింగ్ మెషిన్‌పై ఉతికి ఇస్త్రీ చేయుటకు రజకులు కావలెను. ఉచిత వసతి, భోజన సౌకర్యం కలదు. సంప్రదించు సెల్:9440758535, 9010286434
NTZ-334432
PLOT FOR SALE
★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.
NT-326605
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఘనంగా హోమ్ గార్డ్ రైసింగ్ డే

అవార్డులు అందుకున్న ఉత్తమ సేవలు అందించిన హోంగార్డులు

కామారెడ్డి, డిసెంబర్ 6: కామారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం హోమ్ గార్డు రైసింగ్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన హోమ్ గార్డులకు ఏఆర్ డీఎస్పీ యాకుబ్ రెడ్డి ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖలో భాగమైన హోంగార్డుల సేవలను కొనియాడారు. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో సమర్థవంతంగా విధులను నిర్వహించారని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్ కుమార్, కృష్ణ, ఆర్ఎస్సైలు మహేశ్, చంద్రశేఖర్, హోంగార్డులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలి

అధ్యాపకులతో మాట్లాడుతున్న అధికారి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 6: విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అన్నారు.